క్లుప్తంగా

గృహ నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయండి



ఉంగుటూరు: ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి, డీఈవో పీవీజే రామారావు ఆదేశించారు. స్థానిక మండల స్త్రీశక్తి భవనంలో గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్ష సమావేశం బుధవారం జరిగింది. బిల్లులు ఎప్పటికప్పుడు జమ చేస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల నిర్మాణం చేసేవిధంగా గృహ నిర్మాణ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ పాఠశాలల హెచ్ఎంలతో ఈ నెల 7వ తేదీన జరగబోయే పేరెంట్స్, టీచర్స్ మీట్ గురించి సమీక్ష నిర్వహించి, తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విమలకుమారి, ఎంపీడీవో సత్యకుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

దూసరపాలెం వాసికి జాతీయ అవార్డు



ఉయ్యూరు: ఉయ్యూరు మండలంలోని ముదునూరు శివారు దూసరపాలెంకు చెందిన మత్తె చందుకు జాతీయ స్థాయి అవార్డు లభించింది. పర్యావరణ పరిరక్షణకు ఆయన చేస్తున్న సేవలను గుర్తించి డాక్టర్ అమృతరావు ఎడ్యుకేషనల్ సొసైటీ ఈ అవార్డును అందించింది. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ఈనెల 3న అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ సంస్థ జాయింట్ సెక్రటరీగా పనిచేస్తూ పర్యావరణ పరిరక్షణకు చందు చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ మేరకు అవార్డు అందజేశారు. ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ జ్యోత్స్నరావు జాతీయ అవార్డును చందుకు అందించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ సంస్థ ప్రతినిధులు, ముదునూరు వాసులు ఆయనను అభినందించారు.

ఆర్థిక సాయం అందజేత

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు ఎస్సీ కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు సర్నాల బాలాజీ రూ.8 వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలోని వాటర్ ట్యాంక్ సమీపంలో నివాసం ఉంటున్న గుండు శ్రీనివాసరావు, దేవరపల్లి ఝాన్సీ లక్ష్మిల నివాసాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు పలు గృహోపకరాలు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాద విషయం తెలుసుకున్న సర్నాల బాలాజీ వీరికి ఆర్థిక సాయాన్ని అందజేశారు.

ముమ్మరంగా ఆక్రమణల తొలగింపు

పటమట(విజయవాడతూర్పు): రోడ్డు వెంబడి వ్యాపారాలు చేసుకునే హ్యాకర్లు ట్రాఫిక్‌కు అవరోధం కలగకుండా చూడాలని, వాహన చోదకులకు ఇబ్బందులు కల్పించొద్దని పటమట ట్రాఫిక్ సీఐ యు.రామారావు సూచించారు. పటమట సీఐ పవన్ కిశోర్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పట్టణ ప్రణాళిక విభాగం బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ వశీం బేగ్‌తో కలిసి ఆయన బుధవారం హైస్కూల్ రోడ్డులో ప్రత్యేక ట్రాఫిక్ డ్రైవ్ నిర్వహించారు. పలు ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ రామారావు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో పండ్లు, కూరగాయలు, ఇతర చిరువ్యాపారులు రోడ్డును ఆక్రమించేస్తున్నారని, ఇటువైపు తరచూ ట్రాఫిక్ రద్దీ పెరిగి వాహనాల రాకపోకలకు అవరోధం కలుగుతుందని ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల సూచనల మేరకు ఆక్రమణ తొలగింపు చేపట్టామని తెలిపారు. పటమట పంటకాలు రోడ్డు నుంచి బందరు రోడ్డు వరకు ఇరువైపులా రోడ్డును, డ్రెయిన్లపై ఆక్రమణలను వ్యాపారులకు ఇబ్బందిలేకుండా, రాకపోకలకు సమస్యల లేకుండా తొలగించామని వివరించారు. భవిష్యత్తులో ఎవరు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేసినా కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ

గన్నవరం డ్రెయిన్లలో పారని మురుగు

రోగాల బారిన పడుతున్న ప్రజలు

చర్యలు తీసుకోవాలని వినతి



రాయ్‌నగర్‌లో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు నీరు

గన్నవరం: నియోజకవర్గ కేంద్రమైన గన్నవరం గ్రామ పంచాయతీలో అస్తవ్యస్త డ్రెయినేజీ వ్యవస్థతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పెరుగుతున్న గృహ సముదాయాలకు అనుగుణంగా గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధి చేయలేదు. డ్రెయిన్లలో కనీసం పూడికలు కూడా తీయకపోవడంతో మురుగునీటి పారుదల ఎక్కడకక్కడ నిలిచిపోతుంది. ఫలితంగా గ్రామంలో ఎక్కడ చూసినా మురుగునీటి తటాకాలు దర్శనమిస్తూ పందులు అవాసాలుగా, దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. దీనివల్ల ఇళ్ల మధ్య అపరిశుభ్ర వాతావరణం తాండవీస్తుండడంతో పాటు అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీ క్రమబద్ధీకరణపై పాలకులు, అధికారులు దృష్టి సారించకపోవడం కారణంగానే ఈ సమస్య ఉత్పన్నమవుతుందని వాపోతున్నారు.

ఆదాయం ఘనం.. అభివృద్ధి శూన్యం

మేజర్ గ్రామ పంచాయతీ గన్నవరంలో సుమారు 30 వేలకుపైగా జనాభా నివసిస్తున్నారు. సుమారు ఏడు వేలకు పైగా ఇళ్లు, అపార్టుమెంట్లు, గ్రూపు హౌస్‌లు ఉన్నాయి. గ్రామ పంచాయతీ వార్షిక ఆదాయం రూ.4 కోట్లకు పైగా వస్తుంది. అయినప్పటికీ డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధికి నిధులు కేటాయింపు అంతంతమాత్రంగానే చేస్తున్నారు. గ్రామంలో సుమారు 300లకు పైగా వీధులు ఉండగా ఇప్పటి వరకు కేవలం 50 వీధుల్లో మాత్రమే పక్కా డ్రెయిన్ల నిర్మాణం జరిగింది. స్థానిక శ్రీనగర్‌కాలనీ, రాయ్‌నగర్, ఇస్లాంపేట, గౌడపేట, యాదవులపేట, చింతలపేట, కొత్తపేటలో మాత్రమే కొంత మేర డ్రెయినేజీ వ్యవస్థ ఉంది. స్థానిక రామ్‌నగర్, ఎస్సీ కాలనీ, ఉపాధ్యాయనగర్, కరెంట్ ఆఫీస్ ఏరియా, ఎస్టీ కాలనీ, దావాజిగూడెం, బుద్దవరం రోడ్డులో మురుగునీటి కాలువలు కూడా సక్రమంగా లేవు. కొన్ని ప్రాంతాల్లో డ్రెయిన్లు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరుతున్నాయి. గతంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చొరవతో ఊర చెరువు పరిధిలో సీసీ డ్రెయిన్ల నిర్మాణం జరిగింది. ఆ తర్వాత పాలకులు, అధికారులు డ్రెయినేజీ వ్యవస్థను గాలికి వదిలివేశారు.

పెరుగుతున్న పట్టణీకరణ

గడిచిన పదేళ్లలో గన్నవరం గ్రామ పంచాయతీలో గృహ నిర్మాణాలు గణనీయంగా పెరిగాయి. భారీగా బహుళ అంతస్తుల అపార్టుమెంట్లు, గృహాలను నిర్మించారు. పెరిగిన గృహాలకు అనుగుణంగా డ్రెయినేజీ వ్యవస్థను మాత్రం విస్తరించలేదు. దీంతో ఇళ్లలో నుంచి మురుగునీటి పారుదల లేక ఎక్కడికక్కడ స్తంభించిపోతుంది. గ్రామ పంచాయతీలో సుమారు 60 మందికి పైగా పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నప్పటికీ డ్రెయిన్లలో పూడికలు తొలగించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. దీనివల్ల మురుగునీటి పారుదల లేక డ్రెయిన్లు తీవ్ర దుర్వాసన వెదజల్లుతుండడంతో పాటు సాయంత్రమైతే దోమల బెడద ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. కనీసం దోమల నివారణ మందులు కూడా చల్లడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి డ్రెయినేజీ సమస్యల పరిష్కారం పట్ల దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

● తాటి బురగుంజుకు భలే డిమాండ్



బురగుంజు కొనుగోలు చేస్తున్న వాహనదారుడు (ఇన్‌సెట్‌లో) బురగుంజు

ప్రస్తుత సీజన్‌లో లభించే తాటి బురగుంజుకు ప్రజలు ఎగబడుతున్నారు. కేవలం ఈ సీజన్‌లోనే తేగలు లభిస్తాయి. తేగలు తీసేయగా మిగిలిన బురగుంజును పగలకొట్టి అందులో ఉండే బురగుంజును కొందరు చిరు వ్యాపారులు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. విజయవాడ పరిసర ప్రాంతాలతో పాటుగా గ్రామీణ ప్రాంతాల్లోనూ బురగుంజు విక్రయాలు జరుగుతున్నాయి. ఒక్కో ప్యాకెట్ రూ.50కి అమ్ముతున్నారు. బురగుంజు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. – కంకిపాడు

నేడు తేలప్రోలులో జీపీఎస్‌డీపీ సమావేశం

ఉంగుటూరు: తేలప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 5వ తేదీన గ్రామ పంచాయతీ ప్రాదేశిక అభివృద్ధి ప్రణాళిక(జీపీఎస్‌డీపీ) సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యకుమార్ తెలిపారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ.. పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ నుంచి రాష్ట్ర అధికారులు, ఎస్‌పీఏ టీమ్, జిల్లా అధికారులచే సమావేశం నిర్వహిస్తారన్నారు. జీపీఎస్‌డీపీ కింద ఉంగుటూరు మండలంలో తేలప్రోలు గ్రామ పంచాయతీని ఎంపిక చేశామని తెలిపారు. గ్రామ పంచాయతీ ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి మెరుగుదల, భాగస్వామి సంస్థలకు సహాయం కోసం సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

కంకిపాడు: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి శుక్రవారం నుంచి అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వి.భావనారాయణ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 6న మారేడుమాక, 7న తెన్నేరు, 9న మంతెన, 10న జగన్నాథపురం, 11న వేల్పూరు, 12న ఉప్పలూరు, 13న కుందేరు, 16న కందలంపాడు, 17న దావులూరు, 18న చలివేంద్రపాలెం, 19న ప్రొద్దుటూరు, 20న కొణతనపాడు, 21న కోలవెన్ను, 23న నెప్పల్లి, 24న పునాదిపాడు, 26న ఈడుపుగల్లు, 27న మద్దూరు, 28న గొడవర్రు, 30న కంకిపాడు గ్రామాల్లో సదస్సులు జరుగుతాయన్నారు. సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీసీఎస్ ఉద్యోగాలకు 343 మంది వీఆర్ విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలు సాధించిన వీఆర్ విద్యార్థులతో కాలేజీ యాజమాన్యం

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ విద్యార్థులు సత్తాచాటారు. ఐటీ సేవలు, కన్సల్టింగ్ గ్లోబల్ లీడర్ టాటా కన్సల్టెన్సీలో(టీసీఎస్)లో ఏకంగా 343 ఉద్యోగాలు సాధించారు. ఈ మేరకు వైస్ చాన్సలర్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు బుధవారం వివరాలు తెలుపుతూ తమ యూనివర్సిటీ క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో కొత్త బెంచిమార్కు సృష్టించిందన్నారు. 343 మంది విద్యార్థుల్లో 54 మంది విద్యార్థులకు వార్షిక వేతనం రూ.7 లక్షల నుంచి రూ 9 లక్షలతో డిజిటల్, ప్రైమ్ విభాగాలకు ఎంపికయ్యారన్నారు. అధ్యాపకుల అంకిత భావం, విద్యార్థుల సాధన, కృషితో ఉత్తమ ఫలితాలు సాధించామని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రణాళికాబద్ధంగా ఆధునిక సాంకేతిక విద్య బోధన చేస్తున్నామన్నారు. కాలేజీలో జరిగిన కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు ఎం.రాజయ్య విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.రవిచంద్, ఆయా విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

9న మండల పరిషత్ సమావేశం

కంకిపాడు: కంకిపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 9వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. వివిధ శాఖల పనితీరు, సమగ్ర ప్రగతి నివేదికలపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఆటోడ్రైవర్ అదృశ్యంపై కేసు

పెనమలూరు: తాడిగడపలో ఆటోడ్రైవర్ అదృశ్యమైన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప రామానగర్‌కు చెందిన కుప్పాల యువరాణి కొన్నేళ్ల క్రితం అశోక్‌కుమార్(30)ని వివాహం చేసుకుంది. భర్త ఆటో డ్రైవర్, వీరికి ఇద్దరు పిల్లలు. కాగా భర్త ఫైనాన్స్ కంపెనీలో అప్పులు చేశాడు. కంపెనీ ప్రతినిధులు అప్పులు కట్టాలని ఒత్తిడి చేయసాగారు. అలాగే అశోక్‌కుమార్ ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఆటో గతంలో కంకిపాడుకు చెందిన వ్యక్తికి తాకట్టు పెట్టాడు. సమయానికి అప్పు చెల్లించకపోవటంతో తాకట్టు పెట్టుకున్న వ్యక్తి ఆటో పార్టులు అమ్ముకున్నాడు. రెండు రోజుల క్రితం అశోక్‌కుమార్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని కోసం బంధువులు, కుటుంబ సభ్యులు వెతికినా జాడ తెలియలేదు. దీంతో అతని భార్య ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

బంతి పూల సాగు భళా



కృష్ణా జిల్లాలో బంతి పూల సాగు ఆశాజనంగా ఉంది. వణుకూరు గ్రామ పరిధిలోని ఓ బంతి పూల తోటలో పూలు కోస్తున్న రైతు కూలీ చిత్రాన్ని సాక్షి కెమెరా బుధవారం క్లిక్‌మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఘంటసాల గాత్రశోభ అజరామరం

విజయవాడకల్చరల్: ఘంటసాల గాత్రశోభ అజరామరమని ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. పద్మశ్రీ ఘంటసాల సంగీత కళావేదిక ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద ఘంటసాల జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడుతూ.. ఘంటసాల పాడిన భగవద్గీత ప్రజల్లో జ్ఞానజ్యోతిని వెలిగించిందన్నారు. చాలా మంది గాయనీగాయకులు ఘంటసాల పాటలు పాడుతూ ఉపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నంది పురస్కారాలతో పాటు, ఘంటసాల పేరుతో పురస్కారాలను అందించాలని కోరారు.

నిలిచిన రిజిస్ట్రేషన్లతో క్రయ, విక్రయాలకు ఇబ్బందులు



గన్నవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

గన్నవరం: రిజిస్ట్రేషన్ శాఖ నిర్లక్ష్యం కారణంగా గన్నవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని రెండు గ్రామాల్లో భూముల క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. ఈ రెండు గ్రామాలకు సంబంధించి మార్కెట్ విలువలను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం వల్ల భూముల రిజిస్ట్రేషన్లు నిలిచాయి. దీంతో భూముల రిజిస్ట్రేషన్ల కోసం గత నెలన్నర రోజులుగా ఆ గ్రామాలకు చెందిన క్రయ విక్రయదారులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వివరాలిలా వున్నాయి.

అధికారులు స్పందించాలి..

గన్నవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని మెట్లపల్లి, గారపాడు గ్రామాలకు సంబంధించి భూములకు గతంలో రీ సర్వే నిర్వహించారు. రీ సర్వే అనంతరం ఆయా గ్రామాల భూముల మార్కెట్ విలువలను నమోదు చేసి గన్నవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు జిల్లా రిజిస్ట్రార్‌కు పంపించారు. అయితే జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో మార్కెట్ విలువ అప్రూవల్ కాకపోవడంతో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ఈ రెండు గ్రామాలకు సంబంధించి భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ గత నెలన్నర రోజులుగా నిలిచిపోయింది. భూముల రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో చెక్‌స్లిప్ కొడుతుంటే మార్కెట్ విలువ చూపించడం లేదని, దీనివల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోతుందని క్రయవిక్రయదారులు పేర్కొంటున్నారు. ఇదే సమస్య కారణంగా గుడివాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని ఇందుపల్లి గ్రామంలో కూడా భూముల క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. అత్యవసర పరిస్థితుల నిమిత్తం భూములు విక్రయించుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా రిజిస్ట్రార్ స్పందించి సదరు గ్రామాలకు సంబంధించి భూముల రిజిస్ట్రేషన్‌కు ఎదురవుతున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతులు పంటల బీమా చేయించుకోవాలి



ముస్తాబాదలో రైతులతో మాట్లాడుతున్న జేడీఏ పద్మావతి

గన్నవరంరూరల్: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రైతులు పంటల బీమా చేయించుకోవాలని జేడీఏ పద్మావతి తెలిపారు. మండలంలోని ముస్తాబాద, సూరంపల్లి గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని రైతు సేవా కేంద్రంలో రైతులకు ఫసల్ బీమా పథకంపై అవగాహన కల్పించారు. బీమా చేయించుకునేందుకు మినుము, పెసర, మొక్కజొన్నకు ఈ నెల 15వ తేదీ వరకు, వరికి డిసెంబర్ నెలాఖరు వరకు గడువు ఉందని చెప్పారు. సచివాలయంలోనే ప్రీమియం చెల్లించే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. కౌలు రైతులు సైతం ఈ పథకంపై అవగాహన పెంచుకోవాలన్నారు. కౌలు కార్డు, ఆధార్, బ్యాంకు పాస్ బుక్‌తో సచివాలయానికి వెళ్లి బీమా చేయించుకోవాలని తెలిపారు. ఏడీఏ సునీల్, ఎంఏఓ రజని, వీఏఏలు పాల్గొన్నారు.

ధాన్యం తరలింపునకు చర్యలు



వరి కోతలు పరిశీలిస్తున్న ఏవో శైలజ, రైతులు

పెనమలూరు: ధాన్యం తరలింపునకు అన్ని ఏర్పాట్లు చేశామని, రైతులు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ తెలిపారు. ఆమె బుధవారం గోసాల, వణుకూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో శైలజ మాట్లాడుతూ రైతులు వరి కోతలు తరువాత పంటను ఆరపెట్టాలన్నారు. రైతులకు ధాన్యం రవాణాకు రైతు సేవా కేంద్రాలతో పీపీసీ సైట్‌లో తప్పనిసరిగా రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. రైతుల మాట్లాడుతూ గోనె సంచులు సరిపడా అందుబాటులో లేవన్నారు. ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలు అందుబాటులో ఉంచాలని కోరారు. రైతులకు గిట్టుబాటు ధర తగ్గకుండా న్యాయం చేయాలని ఏవోను కోరారు. మొక్కజొన్న, మినుము పంటల సమస్య రక్షణ వివరాలు ఏవో రైతులకు వివరించారు. వీఏఏలు చాముండేశ్వరి, కిరణ్, రైతులు పాల్గొన్నారు.

పెనమలూరు – చోడవరం రోడ్డుకు మరమ్మతులు

- కొంత మేరకే రోడ్డు నిర్మాణం
- మిగితా ప్రాంతాల్లో గుంతలు పూడ్చివేత



పెనమలూరులో గుంతలు పూడ్చుతున్న కార్మికులు

పెనమలూరు: కూటమి ప్రభుత్వం పనులు కంటితుడుపుగా ఉన్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పెనమలూరు – చోడవరం ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణం చేస్తామని పాలకులు ప్రకటించటంతో అందరూ కొత్త రోడ్డు కోసం ఎదురు చూడసాగారు. అయితే చివరకు కొంత కొత్త రోడ్డు వేయగా, పలు ప్రాంతాల్లో గుంతలు పూడ్చి మమ అనిపిస్తున్నారు. పెనమలూరు – చోడవరం రోడ్డు దాదాపు 6 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. అవనిగడ్డ – విజయవాడ కరకట్ట నుంచి విజయవాడ – మచిలీపట్నం జాతీయ రహదారికి లింకు రోడ్డుగా ఉంది. ఈ రోడ్డు ప్రయాణికులకు చాలా ఉపయోగకరంగా ఉంది. రైతులు పంటలు తరలించటానికి, దివిసీమకు వెళ్లే ప్రయాణికులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తారు. అదే విధంగా ప్రసిద్ధిగాంచిన చోడవరం నాగేంద్రస్వామివారి ఆలయం కూడా ఈ రోడ్డులోనే ఉంది. నిత్యం రద్దీగా ఉండే పెనమలూరు గ్రామంలోనే దాదాపు 2 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరించి ఉంది. ఈ రోడ్డును గత కాంగ్రెస్ పాలనలో పూర్తి స్థాయిలో విస్తరించి నిర్మించారు. ఆ తరువాత వైఎస్సార్ సీపీ పాలనలో అవసరాల మేరకు గుంతలు పూడ్చి రోడ్డును అనువుగా ఉంచారు.

పూర్తిగా గుంతలమయం..

పెనమలూరు – చోడవరం రోడ్డు ఇసుక ట్రాక్టర్ల కారణంగా ఇటీవల పూర్తిగా గుంతలమయంగా మారింది. రోజుకు వందలాది ట్రాక్టర్లు ఇసుక లోడ్‌తో ప్రయాణించడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఇసుక అక్రమ తరలింపుతో రోడ్డుకు పూర్తిగా గ్రహణం పట్టుకుంది. కనీసం వాహనాలు వెళ్ల లేని పరిస్థితికి రోడ్డు చేరుకుంది. దీంతో రోడ్డును వెంటనే నిర్మించాలని గ్రామాల ప్రజలు కోరారు. కూటమి నాయకులు కూడా తాము పూర్తి స్థాయిలో నాణ్యమైన రోడ్డు నిర్మాణం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు.

చెప్పింది ఒకటి.. చేసేది మరొకటి

పెనమలూరు – చోడవరం రోడ్డు రూ.1.50 కోట్లతో అంచనాలు వేసి రూ.1.10 కోట్లతో పనులు ప్రారంభించారు. అయితే కొత్తగా రోడ్డు నిర్మాణం చేయటం లేదు. పలు చోట్ల రోడ్డు వేస్తుండగా చాలా చోట్ల గుంతలు పూడ్చి పైపై మెరుగులు దిద్దుతున్నారు. ఇలా రోడ్డు వేయటం వలన ఉపయోగం ఏమిటని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్డు పూర్తి స్థాయిలో వేస్తామని ప్రకటించి గుంతలు పూడ్చటం సరికాదని, ప్రజలు పెదవి విరుస్తున్నారు. పూడ్చిన గుంతలపై ఇసుక ట్రాక్టర్లు లోడ్‌తో వెళితే రోడ్డు ఉండదని, పూర్తిగా నాణ్యతతో రోడ్డు కొత్తగా నిర్మాణం చేయాలని గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పాలకులు ఈ విషయంలో ఆలోచించి కొత్తగా రోడ్డు వేయని ప్రాంతంలో కొత్త రోడ్డు నాణ్యతతో వేయాలని కోరుతున్నారు.